
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5

వనపర్తి
జిల్లా వార్తలు
శనివారం 6 సెప్టెంబరు 2025


మైక్రో బ్రూవరీలో తయారు చేసిన వివిధ రకాల బీర్లు (ఫైల్)

జ్వరం పీడిస్తోంది

డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్ కేసులు అత్యధికంగా నమోదు


నారాయణపేట జనరల్ ఆస్పత్రిలో ఓపీ క్యూ

- జనరల్ ఆస్పత్రులకు వస్తున్న వారిలో అత్యధికం వైరల్ ఫీవర్ బాధితులే..
- భారీగా నమోదవుతున్న ఇన్‌పేషెంట్లు, వోపీలో కూడా రోగులు రెట్టింపు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 200లకు పైగా డెంగీ కేసుల నమోదు
- జీజీహెచ్‌లతో పాటు పీహెచ్‌సీల్లోనూ క్యూ కడుతున్న జ్వర పీడితులు


మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాను జ్వరం పీడిస్తోంది. రోజురోజుకూ ఆసుపత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరుగుతోంది. వానాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు నమోదవుతూనే ఉంటాయి. ఈ ఏడాది కూడా అత్యధికంగా వైరల్ ఫీవర్, డయేరియా కేసులు నమోదవుతున్నాయి. డెంగీ కేసుల తీవ్రత కూడా ఎక్కువగానే ఉన్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 200లకు పైగా డెంగీ కేసులు నమోదు కాగా నాగర్‌కర్నూలు జిల్లాలో అత్యధికంగా 52 కేసులు నమోదయ్యాయి. ఇవి కేవలం జనరల్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కేసుల సంఖ్య. ప్రైవేటులో చికిత్స పొందుతున్న వారి సంఖ్య దీనికి అదనంగా ఉన్నది. సాధారణంగా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే ఇన్ పేషెంట్ల సంఖ్య 20 శాతం పెరిగింది. ఔట్ పేషెంట్లలో 30 శాతం వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. డాక్టర్లు, బెడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటంతో పెద్దగా ఇబ్బందులు తలెత్తడం లేదు. వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరిగా తీసుకోకపోవడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించకపోవడం వంటి కారణాల వల్ల జ్వరం బారిన పడుతున్నారు. అలాగే డయేరియా కేసులు కూడా ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. పరిశుభ్రమైన నీరు

(మిగతా 7లో..)

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



సీజనల్ వ్యాధులను అరికట్టాలంటే ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని తీసుకోవాలి. జంక్‌ఫుడ్‌ను పూర్తిగా తీసుకోవద్దు. సరిపడా మంచినీరు తీసుకుంటే శరీరం డీ హైడ్రేడ్ కాకుండా ఉంటుంది. కాచిన నీటిని తాగితే అందులో ఉండే మలినాలు శరీరంలోకి వెళ్లక, వ్యాధుల బారిన పడటం కూడా తగ్గుతుంది.

- డాక్టర్ అభిలాష్, జనరల్ ఆస్పత్రి, గద్వాల

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి
- జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్
6

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గుతున్న వరద
- మూసుకున్న ప్రాజెక్టు గేట్లు
7

పాలమూరులో.. మైక్రో బ్రూవరీలు

సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకునే అవకాశం

- అప్పటికప్పుడే తాజా బీర్లు తయారు
- ఏడాదికి రూ.5 లక్షలు లైసెన్స్.. ప్రతీ లీటర్ బీరుకు రూ.50 అదనం
- నిర్వాహకులే ధర నిర్ణయించుకునేందుకు అవకాశం
- ఈనెల 25లోగా దరఖాస్తు గడువు

మహబబూబ్‌నగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ పురపాలిక కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ కావడంతో నగరంలో మైక్రో బ్రూవరీలను ఏర్పాటు చేసుకునేందుకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటి ఏర్పాటు విషయం లో కాంపిటీషన్ లేదు. పెట్టుబడి పెడితే ఎవరైనా ఏర్పాటు చేసుకోవచ్చు.

25లోగా దరఖాస్తులకు ఆహ్వానం

ఈనెల 25లోగా ఆసక్తి గల వ్యాపారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. నగరంలో వీటి ఏర్పాటుకు లిమిట్ లేదు. ఎవరైనా ఏర్పాటు

వైన్స్‌ల పరిస్థితేంటి?

నగరంలో 3-4 మైక్రో బ్రూవరీలు ఏర్పాటైతే ప్రస్తుతం ఉన్న వైన్స్‌లకు దెబ్బ పడనుందన్న చర్చ ఉంది. మైక్రో బ్రూవరీలలో అక్కడే కూర్చుని తాగాలి. పార్సల్ తీసుకెళ్లడానికి ఉండదు. వైన్స్‌ల నుంచి పార్సల్స్ తీసుకెళ్లొచ్చు. ముందు ప్రయోగాత్మకంగా ఓ యూనిట్ సక్సెస్ అయితే మిగతా వాళ్లు ముందుకొస్తారన్న అభిప్రాయం ఉంది.

అక్కడికక్కడే బీరు తయారీ

యూనిట్‌లోని మిషనరీలతో కూల్‌డ్రింక్స్ తరహాలో అక్కడికక్కడే బీరు తయారు చేసి, కస్టమర్లకు జగ్గు, గ్లాసుల ద్వారా అందించనున్నారు. రకరకాల ఫ్లేవర్లు ఉంటాయి. స్ట్రాంగ్, లైట్ బీర్లు కూడా ఉండనున్నాయి. సొంతంగా బ్రాండ్‌ల పేర్లు కూడా పెట్టుకునే వెసులుబాటు ఉంటుంది. కుటీర పరిశ్రమలా వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. బార్ తరహాలో సీటింగ్ కూడా ఉంటుంది. ఫుడ్ సప్లై చేసుకోవచ్చు.

(మిగతా 6లో..)

ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

గద్వాల ఆర్టీసీ బస్టాండ్
- లాభాల బాటలో గద్వాల డిపో
- రూ.20 లక్షలు దాటుతున్న దినసరి రాబడి
6

అదృష్టాన్ని చెరిపేశారు


దౌదర్‌పల్లి దర్గా వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- డిప్పులో ఎంపికైన 100 మంది పేర్ల తొలగింపు
- వారి పేర్లపై ఇది వరకే ఇందిరమ్మ బిల్లులు

గద్వాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు నిర్వహించిన లక్కీ డిప్పులో పేర్లు వచ్చిన లబ్ధిదారుల అదృష్టాన్ని అధికారులు చెరిపేశారు. డిప్పులో ఇళ్లు వచ్చిన 100 మందికి అధికారులు షాక్ ఇచ్చారు. మీ పేర్లపై ఇది వరకే ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని, సొంత ఇల్లు ఉన్న మీరు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అనర్హులని పేర్కొంటూ జాబితా నుంచి వారి పేర్లను తొలగించారు. శనివారం పంపిణీ చేయనున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో వీరి పేర్లు లేవు. ఈ విషయంపై బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు సార్లు ఇంటింటికీ తిరిగి విచారణ చేసినపుడు కనిపించలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే వీరు కలెక్టర్, అదనపు కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చి, పేర్లను తొలగించకూడదని సూచించిన అధికారులు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెళ్లామని తేల్చి చెప్తున్నారు.

ఎంపికకు రెండు సార్లు విచారణ

గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లి దర్గా వద్ద నిర్మించిన 1,275 డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు 2023లో దరఖాస్తులను స్వీకరించారు. దాదాపు 4,200 దరఖాస్తులు వచ్చాయి. వాటిపై అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆధ్వర్యంలో ప్రతీ వార్డుకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ చేయించారు. ఆ తర్వాత మార్చి 25వ తేదీన వార్డు సభలను ఏర్పాటు చేసి అర్హుల జాబితాను ప్రకటించారు. జాబితాలో తమ పేర్లు లేవంటూ ప్రతీ వార్డులో గందరగోళం ఏర్పడింది. టెంట్లు ఎత్తేయడం, జాబితాలను చించేవేయడం తదితర సంఘటనలు జరిగాయి. దీంతో కలెక్టర్ మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో మళ్లీ 989 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5,189 దరఖాస్తులపై ఉన్నతాధికారులు మరోసారి విచారణ చేయించి, పక్కాగా అర్హుల జాబితాను తయారు చేశారు. ఇలా రెండు సార్లు విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారు.

100 మంది అనర్హులు!

రిజర్వేషన్ ప్రకారం వార్డుకు కొన్ని ఇళ్ల చొప్పున 2023, ఏప్రిల్ 15వ తేదీన డిప్పును తీశారు. ఇందు కోసం రెండు వార్డులకు ఒక బృందం చొప్పున కేటాయించారు. వారి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య డిప్పు తీశారు. మొత్తం 1,275 ఇళ్లకు గాను 787 ఇళ్లకు డిప్పు తీశారు. మిగిలిన 488 ఇళ్లను ఆసుపత్రి నిర్మాణం, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు స్థలాలు కోల్పోయిన ఇండ్ల స్థలాల పట్టాదారులకు కోర్టు ఆదేశం మేరకు కేటాయించారు. తాజాగా డిప్పులో ఇళ్లు పొందిన 787 మందిలో 100 మంది అర్హులు కాదని అధికారులు తేల్చేశారు. వారిలో దాదాపు 72 మంది ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారున్నారని గుర్తించారు. మిగిలిన వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారు, కుటుంబం రెండు చోట్ల ఇండ్లు పొందిన వారు ఉన్నారు.

వారందరూ ఇళ్లు లేనివారే..

అనర్హులుగా అధికారులు గుర్తించిన 100 మంది ఇళ్లు లేని వారేనని, అద్దె గృహాల్లో ఉంటున్నారని ప్రతిపక్ష నాయకులు చెబుతున్నారు. విచారణ సమయంలో వారికి ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నిస్తున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు సక్రమంగా జరగలేదని, ఇళ్లు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ నెంబర్లతో దళారులు బిల్లులు పొందారని ఆరోపిస్తున్నారు. అప్పుడు ఇందిరమ్మ ఇల్లు రాలేదు, ఇప్పుడు వచ్చిన డబుల్ బెడ్రూమ్ ఇంటినీ రద్దు చేశారు..

దీంతో వారి పరిస్థితి ఏమిటని అడుగుతున్నారు. పారదర్శకంగా జరిగిన ఇళ్ల కేటాయింపులో చిచ్చు పెట్టొద్దని, 100 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

హోల్డ్‌లో ఉంచాం

డిప్పు ద్వారా గతంలో 787 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. తర్వాత జరిపిన విచారణంలో వారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, బిల్లులు కూడా తీసుకున్నారని తేలింది. దీంతో వారి పేర్లను డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాలో చేర్చలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. దీనిపై ప్రభుత్వ ఆదేశం ప్రకారం కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు.

- శ్రీనివాసరావు, పీడీ, గృహ నిర్మాణ శాఖ, గద్వాల

గురువు ప్రేరణతో ఐఏఎస్ అయ్యాను


ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అచ్చంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒక గురువు ప్రేరణతోనే తాను ఐఏఎస్ అయ్యానని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదని, అది ఒక అత్యున్నతమైనదని అభివర్ణించారు. మన జీవిత దిశను నిర్దేశించి, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా మలిచే శక్తి ఉపాధ్యాయుడి చేతుల్లోనే ఉంటుందన్నారు. దేశం గర్వించదగిన శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా ఆదర్శ ఉపాధ్యాయుడని, ఆయన తన జీవితమంతా విద్యార్థుల కోసం అంకితం చేశారన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక గురువు ఉంటాడని, ఆయన ప్రేరణతోనే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రజా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్ద ఉంచుకొని విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి రమేష్, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం

ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణి, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గీతాంజలి
7

వ్యవసాయ పనులకు వెళ్లి కూలీ మృతి


మైబు(ఫైల్)

రేవల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగపూర్‌లో వరి పొలంలో పిండి చల్లడానికి వెళ్లిన కూలి ఎండీ మైబు(49) ప్రమాదవశాత్తు బురదలో పడి మృతిచెందాడు. ఎస్ఐ రజిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగపూర్‌లోని మధుకర్‌రెడ్డి పొలంలో యూరియా చల్లడానికి అదే గ్రామానికి చెందిన ఎండి మైబు మద్యం తాగి పొలానికి వెళ్లాడు. యూరియా చల్లుతూ ప్రమాదవశాత్తు బురదలో బోర్లా పడిపోయాడు. దీంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. అది గమనించిన పొలం యజమాని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా చేసి రేవల్లి మండల ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం మృతుడి భార్య నూర్జహన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అతనికి నలుగురు కుమార్తెలు ఉన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

- ఘనంగా నిమజ్జనం వేడుకలు




వనపర్తి జిల్లా కేంద్రంలో మంగళ వాయిద్యాల నడుమ నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

గద్వాలలో నిర్వహించిన గణేశ్ నిమజ్జనం ఊరేగింపులో కోలాటం ఆడుతున్న వినాయకనగర్ కాలనీ బాలికలు, యువతులు


సింగారంలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న యువకులు, బాలలు


మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో నృత్యం చేస్తున్న కళాకారిణులు


రాజోలిలో నిర్వహించిన శోభాయాత్రలో నృత్యం చేస్తున్న చిన్నారులు

గంగమ్మ ఒడికి గణనాథుడు

● ఘనంగా నిమజ్జనం వేడుకలు

ఊరూరా కొలువుదీరి తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో శుక్రవారం నిమజ్జనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం, గణపతి విగ్రహాలను అందంగా అలంకరించిన ట్రాక్టర్ ట్రాలీల్లో ఉంచి, పురవీధులలో శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను స్థానిక చెరువులు, కుంటలతో పాటు కృష్ణానదికి తరలించి నిమజ్జనం చేశారు. రాత్రి పొద్దు పోయే వరకు కార్యక్రమం కొనసాగుతూనే ఉంది.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


వనపర్తి జిల్లా కేంద్రంలో వాహనంపై నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు


నారాయణపేట మండలం కోటకొండలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


ఊట్కూర్ పెద్ద చేరువులో వినాయకుడి నిమజ్జనం చేస్తున్నా యువకులు


ఊట్కూర్‌లో శంభాజీ మహారాజు అలంకరణతో మెయిన్ బజార్ హనుమాన్ మందిర్ వినాయకుడు


జడ్చర్లలో గణనాథుడిని నిమజ్జనం ఊరేగింపులో కోలాటం నృత్యం చేస్తున్న పద్మావతి కాలనీ మహిళలు


మహబూబ్‌నగర్ పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

పాలమూరులో మైక్రో బ్రూవరీలు

(5వ పేజీ తరువాయి)

చేసుకునేందుకు అవకాశం ఉంది. అందుకోసం 1,000 గజాల స్థలం ఉండాలి. లక్ష రూపాయల చలాన తీయాలి. ఆధార్‌కార్డు జిరాక్స్, హోటల్, రెస్టారెంట్, బార్, క్లబ్ లైసెన్స్ ఉంటే వాటి జిరాక్స్ ప్రతులను ఈనెల 25లోగా ఏనుగొండలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి. వారికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ నుంచి క్లియరెన్స్ జారీ చేస్తారు. క్లియరెన్స్ వచ్చిన ఆరు నెలల్లో మైక్రో బ్రూవరీ యూనిట్‌ను ప్రారంభించాలి.

లీటరు బీరు తయారీకి రూ.50 టాక్స్

లీటరు బీరు తయారు చేస్తే దానిపై ప్రభుత్వానికి రూ.50 ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అందుకోసం మిషన్‌లకు మీటర్లు అమరుస్తారు. ఏడాదికి రూ.5 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుంది. మద్యం దుకాణాల మాదిరిగా.. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచుకోవచ్చు. ఒకసారి తయారు చేసిన బీరును 36 గంటల్లో విక్రయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే దానిని పారబోయాలి. హైదరాబాద్‌లో ఉన్న మైక్రో బ్రూవరీలు ఇప్పుడు మహబూబ్‌నగర్‌కూ విస్తరించనున్నాయి.

దరఖాస్తులకు ఆహ్వానం

పాలమూరు కార్పొరేషన్ పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటు కోసం ఎక్సైజ్ శాఖ అవకాశం కల్పిస్తోంది. ఈనెల 25లోగా ఆసక్తిగల వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నగరంలో ఎన్ని యూనిట్లైనా పెట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ


కొల్లాపూర్‌లో ఫొటోగ్రాఫర్స్ ఫెస్టివల్ పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఉన్న ఓం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఈ ఎక్స్‌పో కొనసాగనున్నది. దీనికి సంబంధించిన పోస్టర్లను ఫొటో గ్రాఫర్ల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు శ్రీమిత్ర రాజు సమక్షంలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరం, శేఖర్, మాజీ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, మాజీ కోశాధికారి తిరుపతయ్య, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ జాను, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు


ఊర్కొండ ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న రైతులు

ఊర్కొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్ కట్టి రైతులు నిరీక్షించారు. వ్యవసాయ పనులు చేసుకోకుండా యూరియా కోసం మండల కేంద్రానికి రావడం, పోవడమే సరిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆగ్రో సేవ కేంద్రం డీలర్ నచ్చినవారికి నచ్చినంత యూరియా అందించి, పేద, చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ


షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు


బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-13 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీని శుక్రవారం ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారుడు అయినందున క్రీడాభివృద్ధి అంటే ఎంతో తెలుసు అని గుర్తుచేశారు. అందుకే గతేడాది రూ.370 కోట్లు, ఈ ఏడాది రూ.460 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. క్రీడాపాలసీ తెచ్చామని, త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. జిల్లా క్రీడాభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో ఏసీ, స్టేడియంలో సింథటిక్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి, జాతీయస్థాయి క్రీడాకారులు తీర్చిదిద్దుతామన్నారు. టోర్నీలో క్రీడాకారులు తమ ప్రతిభ చాటి రాణించాలని ఆకాంక్షించారు. షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలను ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (ఎండీబీఏ) అధ్యక్షుడు ఎస్. శ్యామ్‌సుందర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎల్.రవికుమార్, ప్రవీణ్ కుమార్, రాష్ట్ర క్రీడా పరిశీలకుడు సుధాకర్, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, రజనికాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి: ఎమ్మెల్యే

ఫ్లెక్సీలో ఫొటోలపై ఎమ్మెల్యే నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఫొటో ఎందుకు పెట్టలేదని, అదే విధంగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడి ఫొటో పెట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వసతుల్లో పోటీలు నిర్వహిస్తే కచ్చితంగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. పోటీలు నిర్వహించే వారు జిల్లా ఒలంపిక్ సంఘంతో చర్చించాలన్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ. వెంకటేశ్ కూడా నిర్వాహకులను నిలదీశారు.

మొదటి రోజు ఫలితాలు

బాలుర సింగిల్స్‌లో పబ్బు వంశ్ (మేడ్చల్) 15-8, 15-8 సెట్ల తేడాతో డి.ఈకాంక్(వరంగల్)పై, శ్రీరాం (మేడ్చల్) 15-6, 15-3 తేడాతో ఆరుష్ నడింపల్లిపై, అద్వైత్ సత్తు (వికారాబాద్) 15-06, 15-7 తేడాతో అభినత్ అసోల్లపై, టీ.కార్తీకేయ (రంగారెడ్డి) 15-9, 15-8 తేడాతో జార్జి నిశ్చయ్‌పై గెలిచారు. బాలికల సింగిల్స్ విభాగంలో అభజాదవ్ (రంగారెడ్డి) 15-9, 15-9 తేడాతో వేదితరెడ్డి (వరంగల్)పై, దియా ఆనంద్ (వికారాబాద్) 10-15, 15-6, 15-12 తేడాతో జోవిత దెబ్‌నాత్ (రంగారెడ్డి)పై, అన్విరెడ్డి (సూర్యపేట) 15-1, 15-1 తేడాతో ఏ.ప్రకృతి (భద్రాది)పై గెలుపొందారు.

ఉత్సాహంగా గణేశ్ లడ్డూల వేలం

- పెద్దకొత్తపల్లిలో రూ. 1.51 లక్షలు
- మరికల్‌లో రూ.1.65 లక్షలు


పెద్దకొత్తపల్లిలో కురువ గేరిలో గణేష్ లడ్డూను దక్కించుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ సోదరులు

పెద్దకొత్తపల్లి/మరికల్/సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద లడ్డూ వేలం పాటలు ఉత్సహంగా కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కురువ గేరిలో గణేశ్ యువజన బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను గురువారం రాత్రి వేలం వేశారు. పెద్దకొత్తపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ సోదరులు రూ.1,51,116కు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు బెట్టరి బీరయ్య, ఆలివేలమ్మ, బెట్టరి నాగరాజు, జానయ్య, దండు చంద్రయ్య పాల్గొన్నారు.

● నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని హనుమాన్‌వాడలో ప్రతిష్ఠించిన వినాయకుడి సన్నిధిలో లడ్డూను వేలం వేశారు. పోటీ పోటీగా సాగిన వేలంలో గ్రామస్థుడు వడ్డీ నర్సింహులు రూ. 1.65 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కలశాన్ని రూ. 21 వేలకు బోయరాములు అనే వ్యక్తి సొంతం చేసుకున్నారు.

స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయాలి

- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు వినతి


కేంద్ర మంత్రిని సన్మానించి పూల బొకే అందిస్తున్న వాకిటి శ్రీహరి, శివసేనారెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి నియోజకవర్గానికి స్విమ్మింగ్ పూల్, హాకీ టర్ఫ్ కోర్టులను మంజూరు చేయాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరారు. ఖేలో ఇండియా పోటీలను రాష్ట్రంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని అధికార నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహం, క్రీడా మైదానాల అభివృద్ధి, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. వనపర్తి నియోజకవర్గం ఎప్పటి నుంచో హాకీ క్రీడకు ప్రసిద్ధి చెందిందన్నారు. కేంద్రం నిధులతో ఇక్కడ హాకీ టర్ఫ్ కోర్టు, స్విమ్మింగ్ పూల్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు కేంద్ర మంత్రిని ఘనంగా సన్మానించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు


వట్టెం వెంకన్న ఆలయంలో ఉత్సవమూర్తులను చతుస్థాన అర్చనకు తీసుకెళ్తున్న పురోహితులు

బిజినేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా వ్యవస్థాపక ధర్మకర్తల మండలి సభ్యుడు సందడి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం, సామూహిక పూజలు నిర్వహించారు. అనంతరం చతుస్థాన అర్చనతో ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనంత నరసింహారెడ్డి, వ్యవస్థాపక సభ్యులు చంద్రారెడ్డి, సందడి రామచంద్రారెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, సందడి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీకి మహాలక్ష్మీ కళ

- లాభాల బాటలో గద్వాల డిపో
- రూ.20 లక్షలు దాటుతున్న దినసరి రాబడి
- 85 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో


గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

గద్వాల అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాల్లో మొట్ట మొదట ప్రారంభించిన మహాలక్ష్మి స్కీం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు వరంగా మారింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏ ఇతర డిపోలో లేని విధంగా గద్వాల డిపో పరిధిలో మహిళ, పురుష ప్రయాణికుల నిష్పత్తి సమానంగా ఉండటం డిపోకు ఆర్థికంగా కలిసొచ్చే అంశంగా మారింది. డిపో పరిధిలోని సరిహద్దులో ఉండే రెండు ప్రధాన (గద్వాల - రాయచూర్, గద్వాల - కర్నూలు) రూట్లలో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో డిపో ఆదాయం గణనీయంగా పెరిగింది. గతంలో డిపో ఆక్యుపెన్సీ రేషియో 60 శాతానికి మించకపోగా, మహాలక్ష్మి పథకం అమలు తరువాత ఆదికాస్తా 85 శాతానికి మించడం విశేషం.

మూడు కోట్లకు మించి..

రాష్ట్ర ప్రభుత్వం 2023, డిసెంబరు 15న మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నాటికి గద్వాల డిపో పరిధిలో మొత్తం 3.70 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. వారిలో 2.23 కోట్ల (60.32 శాతం) మంది మహిళా ప్రయాణికులు ఉండటం గమనార్హం. దీంతో డిపోకు ఈ ఏడాదిన్నర కాలంలో రూ.80.87 కోట్ల మేరకు ఆదాయం లభించింది. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు ఉన్న ఆదాయంతో పోల్చితే, డిపో దినసరి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. డిపోలో మొత్తం 102 సర్వీసులు (ప్రైవేటు 45, డిపార్ట్‌మెంట్ 57 బస్సులు) ఉన్నాయి. మొత్తం 36 షెడ్యుల్ రూట్లలో ప్రతీ రోజు 43 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్న బస్సుల ద్వారా ప్రస్తుతం రూ.20 లక్షలకు పైగా ఆదాయం లభిస్తోంది. అందులో నగదుగా వచ్చేది రూ.12 లక్షల వరకు ఉంది. మిగతా సొమ్ము మహాలక్ష్మి పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్ల ద్వారా ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్ము. ఇదే డిపో పరిధిలో మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు రూ.14 లక్షలకు మించి దినసరి ఆదాయం లభించేది కాదు. గద్వాల డిపోలో మొత్తం 439 మంది సిబ్బంది పని చేస్తుండగా, వారిలో 131 మంది డ్రైవర్లు, 188 మంది కండక్టర్లు, 52 మంది గ్యారేజీ సిబ్బంది ఉన్నారు.

బస్సుల కోసం పెరుగుతున్న డిమాండ్

కరోనా అనంతరం గద్వాల డిపో పరిధిలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల రూట్లలో సర్వీసులు రద్దయ్యాయి. ఆయా రూట్లలో సర్వీసుల పునరుద్ధరణ కోసం ప్రయాణికుల నుంచి బలంగా డిమాండ్లు వినిపిస్తున్నాయి. గతంలో ఆర్టీసీ బస్సులు తిరిగిన రూట్లలో ప్రైవేటు వాహనాల తాకిడి పెరిగి డిపోకు ఆదాయం పడిపోయింది. గత్యంతరం లేక వాటిని రద్దు చేసిన అధికారులు, ఆయా రూట్లలో బస్సులను పునరుద్ధరించేందుకు సుముఖంగా లేనట్లు తెలుస్తుంది. దీంతో పాటు గతంతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల కోసం గద్వాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల సమయానికి అనుకూలంగా సర్వీసులు నడిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు సైతం ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

బస్సుల పెంపునకు ప్రతిపాదనలు



పెరిగిన ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులను పెంచేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. గతంలో సర్వీసులు నడిచిన రూట్లలోనూ ప్రయాణికుల రద్దీని బట్టి నిర్ణయం తీసుకుంటాం. మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేక సర్వీసులు నడిపే ఆలోచన లేదు. పండుగలు, పర్వదినాల సందర్భంగా రద్దీగా ఉండే రూట్లలో అదనపు ట్రిప్పులు నడపడం ద్వారా ఇబ్బందులను అధిగమిస్తున్నాం.

- సునీత, గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు రైలులో నుంచి కిందపడి వ్యక్తి మృతి

గద్వాల క్రైం/ఆత్మకూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక గుర్తుతెలియని వ్యక్తి(45) శనివారం రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి రైలుబండిలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు శ్రీరాంనగర్ స్టేషన్‌లో రైలునుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు తెలుపురంగు ఫుల్‌షర్టు, ఎలిఫెంట్ బ్లాక్ జీన్స్ ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

లారీని ఢీకొట్టిన బొలెరో

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కృష్ణ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడేబల్లూరు గ్రామ శివారులోని 167వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ నియోజకవర్గం సంగంబండ రిజర్వాయర్ నుంచి బొలెరో చేపల లోడుతో రాయచూర్ వెళ్తున్న వాహనాన్ని రాయచూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో బొలెరో బోల్తాపడింది. డ్రైవర్ శ్రీనివాస్‌కు కుడి చేయి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే రాయచూర్ బసవేశ్వర ఆసుపత్రిలో తరలించగా, చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. జాతీయ రహదారిపై అడ్డం పడిన వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ నవీద్ అన్నారు. కేసు దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నవీద్ అన్నారు.

మృతదేహం వెలికితీత

నవాబ్‌పేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని దేపల్లి గ్రామానికి చెందిన ఎండీ జావేద్ శవం బయటకు తీసినట్లు భార్య అన్వర్ బేగం శుక్రవారం తెలిపారు. ఈనెల 3న ఇంటినుంచి గ్రామ సమీపంలో ఉన్న కాకర్జాల పెద్ద చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో గ్రామానికి చెందిన బుచ్చయ్య అనే వ్యక్తి వారించినా వినకుండా చేపలు పట్టేందుకు వెళ్లి ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు శవం బయటకు తీసేందుకు గజ ఈతగాళ్లతో యత్నించినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం దొరకడంతో బయటకు తీశారు. భార్య అన్వర్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

బంగారు, నగదు చోరీ


ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

శ్రీరంగాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల పరిధిలోని శేరుపల్లి గ్రామంలో బంగారు నగదు అపహరణ అయిందని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. శేరుపల్లి గ్రామానికి చెందిన ఎల్లాస్వామి అనే రైతు ఇంట్లో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు ఆయన తెలిపారు. 2.7 తులాల బంగారం, నగదు గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లారని అని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

బిజినేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కిందపడిన సబావత్ ఆంజనేయులు(40) అనే వ్యక్తి తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ కే శ్రీనివాస్ శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర తండాకు చెందిన మృతుడు స్వంత బైక్‌పై ఈనెల 3న రాత్రి వనపర్తి జిల్లాలోని చిన్నమందడిలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. బిజినేపల్లి మండలం పాలెం గ్రామ సమీపంలోని రైస్ మిల్లు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడి తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి కొడుకు సబావత్ మహేష్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గ్రాయాలు

మిడ్జిల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని రాణిపేట గ్రామ శివారులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో జడ్చర్లకు చెందిన బాలస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఎలక్ట్రిసిటి పనులు చేసే బాలస్వామి జడ్చర్ల నుంచి మిడ్జిల్ వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు అకస్మాత్తుగా దారి మళ్లించడం వల్ల ప్రమాదం జరిగింది. గాయపడిన బాలస్వామిని స్థానికులు జడ్చర్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు తమ వద్దకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రెండు వర్గాలపై కేసు

రాజాపూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ వినాయక నిమజ్జనంలో భాగంగా గురువారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. రెండు వర్గాలకు చెందిన సుమారు 20 మందిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివానందం గౌడ్ తెలిపారు. పోలీసు విధులకు ఆటంకం కల్గించిన 16 మందిపై కేసులు నమోదు చేసిన్నాట్లు పేర్కొన్నారు. విధులలో ఉన్న పోలీసు సిబ్బందిపై, విధులకు ఆటంకం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటమని ఎస్‌ఐ అన్నారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు


దాసరి అరుణ్

ఊర్కొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యం అయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం గుడిగానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిగానిపల్లి గ్రామానికి చెందిన దాసరి కృష్ణయ్య వృత్తిరీత్యా ఆర్టీసీ డ్రైవర్‌గా గద్వాల డిపోలో విధులు నిర్వహిస్తూ గ్రామానికి రాకపోకలు కొనసాగిస్తున్నాడు. అతడి కుమారుడు దాసరి అరుణ్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. 15 రోజుల క్రితం తట్టు (చికెన్‌ఫాక్స్) రావడంతో ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 2న పాఠశాలకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా చేసి ఇంట్లో నుంచి బయటికి వస్తున్న క్రమంలో పారిపోయినట్లు, ఎంత వెతికినా ఆచూకీ లభించలేదని అన్నారు. గతంలో ఓసారి ఇలాగే వెళ్లి బంధువుల ఇంట్లో ఉండగా నచ్చచెప్పి తీసుకువచ్చామని, ఈ సారి బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మురళి(ఫైల్)

మల్దకల్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన నరసింహులు, పుష్పావతి దంపతుల కుమారుడు మురళి (18) అనే యువకుడు తల్లిదండ్రులు చదువుకోమన్నందుకు మనస్తాపంతో ఆగస్టు 24న పొలం దగ్గర పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి పుష్పావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

జ్వరం పీడిస్తోంది..


వనపర్తి జనరల్ ఆసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న చిన్నారులు

(5వ పేజీ తరువాయి)

తాగకపోవడం వల్ల వాంతులు, వీరేచనాలతో ఆసుపత్రులకు బారులు తీ రుతున్నారు. వేల సం ఖ్యలో వైరల్ ఫీవర్ బాధితులు వస్తుండటంతో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలు కిక్కిరిసిపోతున్నాయి.

వైరల్ ఫీవర్లు అధికం...

వైరల్ ఫీవర్ల బారిన ప్రజలు అధికంగా పడుతున్నారు. ముఖ్యంగా ఆగస్టు నెలలో అత్యధికంగా వర్షాలు కురవడం, నీళ్లు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది వైరల్ ఫీవర్లు అధికంగా నమోదవుతున్నాయి. వనపర్తి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 8566 వైరల్ ఫీవర్ కేసులు నమోదు కాగా.. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో 2898 మంది చికిత్స తీసుకున్నారు. నారాయణపేట జిల్లాలో 1469 వైరల్ ఫీవర్ కేసులు ఇప్పటివరకు నమోదయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 5958 మంది వైరల్ ఫీవర్ బాధితులు జనరల్ ఆసుపత్రితో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో చికిత్స తీసుకున్నారు. గద్వాల జనరల్ ఆస్పత్రిలో 259 మంది ఇప్పటివరకు ఇన్‌పేషెంట్లుగా వైరల్ ఫీవర్లకు చికిత్స తీసుకున్నారు. వైరల్ ఫీవర్లు ఎక్కువగా చిన్నపిల్లలపై ప్రభావం చూపుతున్నాయి. వోపీకి వచ్చే పేషెంట్లలో సగానికిపైగా చిన్న పిల్లలు ఉంటుండటం కలవరపెడుతోంది. అలాగే డెంగీ కేసులు కూడా అధికంగా నమోదవడం కలవరపెడుతోంది. నాగర్‌కర్నూలు జిల్లాలో ఇప్పటివరకు 52 డెంగీ కేసులు నమోదు కాగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఆగస్టు నెలలోనే 42 మంది డెంగీ చికిత్స తీసుకున్నారు. వనపర్తి జిల్లాలో 49 డెంగీ కేసులు, జోగులాంబ గద్వాల జిల్లాలో 13 కేసులు, నారాయణపేట జిల్లాలో 44 కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా నీళ్లు అధికంగా నిలిచిపోవడం, ఓపెన్ ప్లాట్లు, డ్రెయినేజీలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ కేసులు అధికంగా నమోదు కావడానికి కారణమవుతున్నాయి.

- పెరిగిన ఓపీ, ఐపీ...

జ్వర పీడితులు పెరుగుతుండటంతో జనరల్ ఆసుపత్రులతో పాటు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో వోపీ, ఐపీ నమోదు పెరుగుతోంది. నారాయణపేట జనరల్ ఆస్పత్రికి రోజుకు 800 నుంచి 1000 వరకు ఓపీ నమోదవుతుండగా 13 పీహెచ్‌సీల పరిధిలో 2700 నుంచి 2800 వరకు ఓపీ నమోదవుతోంది. జనరల్ ఆస్పత్రిలో ఐపీ 160 వరకు నమోదవుతుండగా పీహెచ్‌సీల్లో 90 నుంచి 100 ఐపీ ఉంటోంది. వనపర్తి జనరల్ ఆస్పత్రికి ఐపీ 40 నుంచి 45 వరకు నమోదవుతుండగా ఓపీ 850 నుంచి 900 వరకు నమోదవుతోంది. పీహెచ్‌సీలకు 1150 వరకు ఓపీ నమోదవుతుండగా ఐపీ 24 మంది వరకు రోజూ అడ్మిట్ అవుతున్నారు. నాగర్‌కర్నూలు జనరల్ ఆస్పత్రిలో 1200 వరకు ఓపీ నమోదవుతుండగా ఐపీ 114 మంది వరకు ఉన్నారు. పీహెచ్‌సీల్లో 800 వరకు ఓపీ నమోదవుతోంది. గద్వాల జనరల్ ఆస్పత్రిలో ఐపీ 70 వరకు నమోదవుతుండగా 850 వరకు ఓపీ నమోదవుతోంది. పీహెచ్‌సీల్లో సగటున 20 ఐపీ, 20 వరకు ఓపీ అన్ని పీహెచ్‌సీల్లో నమోదవుతోంది. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో 310 ఓపీ ఉండగా 2134 వరకు ఔట్‌పేషెంట్ నమోదుతోంది. ఇందులో 1270 వరకు వైరల్ ఫీవర్ ఓపీలే కావడం గమనార్హం. కొన్ని జిల్లాలో 10 నుంచి 15 శాతం వరకు మందుల కొరత ఉన్నది.

పీయూ స్టాల్‌ను పరిశీలించిన సీఎం

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీయూ స్టాల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించి అభినందించారు. పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు వైద్యుడి సహాయం లేకుండా రోగికి ఆక్సిజన్ అందించే రిమోట్ కంట్రోల్ సిస్టమ్ యంత్రాన్ని పరిశీలించారు. అలాగే, మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు కనుగొన్న వరి కొత్త వంగడాలు వాటి వినియోగం, నానో టెక్నాలజీల గురించి అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్‌లోని శిల్పాకళా వేదికలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సీఎంతో పాటు రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా, అన్ని విశ్వవిద్యాలయ వీసీలకు పీయూ అధ్యాపకులు డాక్టర్ చంద్రకిరణ్, ఎస్‌ఎన్ అర్జున్‌కుమార్‌లు వివరించారు. పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించి వాటి గురించి తెలుసుకొని అధ్యాపకులను అభినందించారు. ఇందులో భాగంగా పీయూ ఏర్పాటు చేసిన లా, ఇంజనీరింగ్ కళాశాల అడ్మిషన్స్, భవనాల నిర్మాణాలు, ఇంజనీరింగ్ బాలురు, బాలికలకు హాస్టల్స్ ఏర్పాటు అభివృద్ధి పలు విషయాలను సీఎంకు, మంత్రులకు పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ వివరించారు. పీయూ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పీయూ అధ్యాపకులు రూపొందించిన వైద్యుడి సహాయం లేకుండా రోగికి ఆక్సిజన్ అందించే రిమోట్ కంట్రోల్ సిస్టమ్ గురించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తున్న పీయూ అధ్యాపకులు డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ ఎస్‌ఎన్ అర్జున్ కుమార్

అతి చిన్న ఖురాన్ గ్రంథానికి ప్రార్థనలు

- గట్టులో అగ్గిపెట్టే కన్నా చిన్న ఖురాన్ గ్రంథం
- 480 పేజీలు.. 30 పర్వాలు
- మిలాద్ ఉన్ నబి సందర్భంగా గ్రంథానికి ప్రత్యేక ప్రార్థనలు


చిన్న గ్రంథానికి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


చిన్న గ్రథాన్ని చూపిస్తున్న ముస్లిం మత పెద్ద

గట్టు, సెప్టంబరు 5 (ఆంధ్రజ్యోతి): అగ్గిపెట్టేకన్నా చిన్న సైజులో ఉన్న అరుదైన అతి చిన్న పురాతనమైన రెండు పవిత్ర ఖురాన్ గ్రంథాలకు గట్టులోని జామియా మసీదులో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా మాత్రమే వీటిని కిందకు దింపి ప్రార్థనలు చేయడం ఆనవాయితీ. ఏడాదికి ఒక్కసారి మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మాత్రమే వీటిని కిందకు దింపి ప్రార్థిస్తారు. అతి చిన్న గ్రంథంలోని అక్షరాలను భూతద్దంతో చూస్తేనే లిపి కన్పిస్తుంది. ఈ గ్రంథంలో మొత్తం 480 పేజీలు.. 30 పర్వాలు ఈ గ్రంథంలో ఉన్నాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఇలాంటి అరుదైన పురాతన ఖురాన్ గ్రంథాలు కేవలం గట్టులో మాత్రమే ఉన్నాయని మత పెద్దలు పేర్కొంటున్నారు.

గట్టుకు చెందిన ముస్లింలు తర తరాలుగా గ్రంథాలను భద్రపరుస్తూ వస్తున్నారు. మండల కేంద్రమైన గట్టులోని జామియా మసీదుతో పాటు బిచ్చాలపేటలోని మసీదులో ఉన్నాయి. మొగల్ చక్రవర్తుల కాలంలో ఈ మసీదులను నిర్మించారని చెబుతున్నారు. అప్పటి నుంచి ఈ గ్రంథాలు ఇక్కడ ఉన్నాయని ముస్లింలు పేర్కొంటున్నారు. ఈ గ్రంథాలను దర్శించుకుంటే పాపాలు పోతాయని వారి విశ్వాసం. అందుకే మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు గట్టుకు వచ్చి చిన్న గ్రంథాలను దర్శించుకుని ప్రార్థనలు చేసుకుని వెళ్తారని ముస్లింలు తెలిపారు.

చెడును వదిలి మంచినే స్వీకరిద్దాం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త బోధించినట్లు ప్రతీ ఒక్కరూ చెడును వదిలి మంచిని మాత్రమే స్వీకరించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహమ్మదీయ మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త జన్మించిన రోజు (మిలాద్ ఉన్ నబి) సమాజంలోని ప్రతీ ముస్లిం సోదరుడికి ఎంతో పవిత్రమైనదని, ప్రవక్త సూక్తులు పాటిస్తే సుఖసంతోషాలే ఉంటాయన్నారు. ప్రవక్త హజ్రత్ మొహమ్మద్ బోధించిన నిజాయితీ, కరుణ, సమానత్వం విలువలను మనందరం ఆచరిస్తూ, ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. మసీదు పెద్దలు చిన్నారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఖమ్మర్ మియా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా, రాజేష్, రాము, మహమ్మదీయ మసీదు పెద్దలు పాల్గొన్నారు.

● వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...

పట్టణంలోని గాంధీచౌక్‌లో గల మహమ్మదీయ మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. మసీదు పెద్దలు మిలాద్ ఉన్ నబీ ప్రవక్త 1500 జయంతి ప్రత్యేకతలను ఎమ్మెల్యేకు వివరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్లు బి కృష్ణ, పాకనాటి కృష్ణ, లతీఫ్, రఫిక్, మన్సూర్, ఇర్ఫాన్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం


హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డును అందుకుంటున్న నాగరాల ఉపాధ్యాయుడు విష్ణువర్ధన్‌నాయుడు


రాష్ట్ర అధికారులచే అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు దేవన్న

కందనూలు/శ్రీరంగాపురం/కొత్తకోట/పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ(ఆర్ట్స్, కామర్స్) కళాశాల ప్రిన్సిపాల్ కే గీతాంజలి ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక వృత్తిలో అందించిన సేవలకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక పురస్కారం అందజేసింది. సెప్టెంబరు 5వ తేదీన శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని శిల్పకళావేదిక శిల్పారామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణి, కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు.

● వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల పరిధిలోని నాగరాల మూడవ సెంటర్‌లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న విష్ణువర్ధన్‌నాయుడు రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల వేడుకలలో ఆయన ఈ గౌరవాన్ని శుక్రవారం అందుకున్నారు.

● కొత్తకోట మండలంలోని అప్పరాల ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు దేవన్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 49 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు హైదరాబాద్ గచ్చిబౌలి శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పురస్కారాలు పంపిణీ చేశారు.



రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డును రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగిత రాణా చేతుల మీదుగా అందుకుంటున్న పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

● పాలమూరు యూనివర్సిటీలోని పీజీ కళాశాల ప్రిన్సిపాల్, మైక్రోబయాలజీ విభాగాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ మధుసూదన్ రెడ్డికి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ యోగిత రాణా చేతులమీదుగా ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు అభినందించారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గుతున్న వరద

- 1.16 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మూసుకున్న ప్రాజెక్టు గేట్లు

గద్వాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. శుక్రవారం ప్రాజెక్టు 1.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు గేట్లు మూసుకోగా కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,327 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 208.72 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 75 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 85 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తోంది. ప్రస్తుతం జూరాలకు 76,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 4 గేట్లను ఎత్తి 27,504 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 41,602 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 49 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 47 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారి

కొత్తకోట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర సమీపంలోని వెంకటగిరి క్షేత్రంలో ఒక శిలపై శ్రీదేవి, భూదేవి సమేతుడిగా వెలసిన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆలయ పూజారి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. పూజల్లో రాజు, భరత్ భూషణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మంత్రుల రాక


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పెద్దమందడి/గద్వాల న్యూటౌన్/మూసాపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ గృహ ప్రవేశానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగపల్లి గ్రామానికి వస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొనను న్నారని పార్టీ నాయకులు తెలిపారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ బీఎం సంతోష్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు ఆయన గద్వాల పట్టణానికి చేరుకోనున్నారు. దౌదర్‌పల్లి సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించను న్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి, సహపంక్తి భోజనం చేయనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహప్రవేశాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆర్డీవో నవీన్, గృహనిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మిడ్జిల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని దోనూరు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. దోనూరుకు చెందిన వెంకటయ్య-బాలమ్మ దంపతుల కుమారుడు గొరిగే శంకర్ వ్యవసాయ పనుల్లో తండ్రికి తోడ్పడేవాడు. గురువారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జనంలో స్నేహితులతో కలిసి పాల్గొని ఇంటికి చేరుకున్నాడు. అనంతరం పడుకున్న శంకర్ (21) శుక్రవారం ఉదయం ఎంతకీ లేవక పోవడంతో తల్లి వెళ్లి చూసింది.

అప్పటికే అతడు ఉరి వేసుకొని మృతి చెందినట్లు గమనించింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

న్యూస్ బాక్స్

రైతులకు అందుబాటులో యూరియా

ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయంలో శనివారం పంపిణీ చేయడానికి 300 బస్తాల యూరియా సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పంపిణీ చేసిన టోకెన్లు ఉన్న రైతులకు యూరియా పంపిణీ చేస్తామని, అలాగే శనివారం మరో 300 బస్తాలు యూరియా రానుందని చెప్పారు. కొత్తగా టోకెన్లు రైతులకు అందజేసి యూరియా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే యూరియా వాడకాన్ని కూడా రైతులు తగ్గించి నానో యూరియాను అలవాటు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్థులు

మదనాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలాభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అజ్జకొల్లులో పర్యటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక డబుల్ బెడ్రూం ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి 40 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను దర్శించుకున్నారు. మహేష్‌కుమార్, వెంకట్ నారాయణ, కృష్ణవర్ధన్‌రెడ్డి, మణివర్ధన్ రెడ్డి, శ్రీను, జగదీష్, వడ్డె కృష్ణ పాల్గొన్నారు.

కనిమెట్టలో కాళికాదేవీ బోనాలు

కొత్తకోట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనిమెట్ట గ్రామ ప్రజలు కాళికాదేవీ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి బోనంను సమర్పించారు. కొందరు కోళ్లు, కొబ్బరి కాయలతో మొక్కులు చెల్లించుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నాయకులతో వెళ్లి కాళికాదేవిని దర్శించుకున్నారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయెజ్, బీమపల్లి యాదవ్, శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, వెంకటరమణ, కోటేశ్వర్‌రెడ్డి, పెంటన్న, నాగేశ్వర్‌రెడ్డి, సాయులుగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాద బాధితులను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. గురువారం మధ్యరాత్రి వినాయక నిమజ్జనం చేసి వస్తుండగా.. పెబ్బేరులోని రెస్టారెంట్ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నాచహల్లి గ్రామానికి చెందిన యువకులు ఇద్దరు మృతిచెందారు, కొందరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అంబులెన్స్‌లో కాన్పు

వీపనగండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దీప్తి కాన్పు కోసం 108 అంబులెన్స్‌లో శుక్రవారం వీపనగండ్ల ఆసుపత్రికి బయలుదేరింది. మార్గమధ్యలో ఆమెకు నొప్పులు తీవ్రమవగా.. అంబులెన్స్ సిబ్బంది అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. గర్భిణి దీప్తి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ వెంటనే వీపనగండ్ల ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ పైలెట్ శివయ్య, టెక్నీషియన్ సాయికుమార్ తెలిపారు.

జెండాలు ఏర్పాటు చేస్తామని నిరసన

ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలో మునిసిపల్ హైమాస్ట్ స్తంభాలపై జెండాలను ఏర్పాటు చేస్తామని ఓ వర్గం వారు గురువారం గాంధీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ కలుగజేసుకుని పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలియజేసి వారిని తిప్పి పంపించారు.

గురువులు.. విద్యార్థి జీవితానికి మార్గదర్శకులు

వనపర్తి విద్యావిభాగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి వసతిగృహ సంక్షేమ అధికారి పసుల సత్యనారాయణ యాదవ్, సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు, గురువులు ప్రతీ విద్యార్థి జీవితానికి మార్గదర్శకులు అని, వారి బోధనలతోనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. శ్రీనివాసులు, నాగమ్మ, సుజాత, అభిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు శ్రీవాణి పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు


వనపర్తి విజ్ఞాన్ కళాశాలలో..

సమాజ నిర్మాతలే గురువులు

వనపర్తి టౌన్ : సమాజ నిర్మాతలే గురువులు.. పాఠశాలలే మేధోవికాసానికి కేంద్రాలని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిరాజాచారి, నాయికంటి నరసింహాశర్మ, శ్రీనివాసులు శెట్టి, బాలేమియా, కురుమయ్య, రంగస్వామి, వెంకట్, తిమ్మప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

వనపర్తి విద్యావిభాగం : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని 16 సంవత్సరాలుగా అర్థశాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న పసుపుల సంతోష్ రాజును విజ్ఞాన్ కళాశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..

పాన్‌గల్ : వివిధ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని గుర్తు చేశారు. మండలంలోని 10 పాఠశాలలో 30 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేశారన్నారు. ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ, నాగయ్య గౌడ్, లక్ష్మి దేవమ్మ, పద్మ సంధ్యారాణి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పాన్‌గల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మండల విద్యాధికారి శ్రీనివాస్

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆత్మకూరు, : ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఎంవి రామన్, శ్రీవాణి హై స్కూల్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.


వనపర్తిలో నివాళి అర్పిస్తున్న మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు

ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం


ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

పెబ్బేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజల సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తోమాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పదేళ్ల నుంచి సొంతింటి నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూశారని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పించాలని గత పాలకులు, నాయకులు, అధికారుల చుట్టూ ఏళ్లకు పైబడి తిరిగినా ఫలితం లేకుండాపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో సొంతింటి కల నెరవేరనుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ గౌడ్, విజవర్ధన్ రెడ్డి, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, రామన్ గౌడ్, రణధీర్ రెడ్డి తదితరులున్నారు.

జర్నలిస్టుల భవన నిర్మాణానికి సహకారం..

వనపర్తి : పట్టణ పరిధిలోని నాగవరం శివారులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అన్ని వసతులతో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు జిల్లా భవనం నిర్మాణం కోసం పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు మాధవరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. వాటిని పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవనం నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని, అందుకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సహకారం కూడా తీసుకుంటామన్నారు. రాజు, ఉషన్న, బాలస్వామి, ప్రశాంత్, మన్యం, కమాల్, ఆంజనేయులు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు ముందుకు సాగాలి

పాన్‌గల్ ,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో భూమి భుక్తి విముక్తి కోసం వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించారని గుర్తు చేశారు. అదే రకంగా 10 లక్షల ఎకరాలు భూమిని ఎర్రజెండా నాయకత్వంలో పేదలకు పంపిణీ చేసిన ఘనత ఎర్రజెండాకే ఉందని పేర్కొన్నారు. అనంతరం అమరవీరులకు పార్టీ కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నాయకులు చంద్రశేఖర్, వెంకటయ్య, భరత్, వేణుగోపాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దమందడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గించడంతో భారీగా పేదలకు మేలు జరుగుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య అన్నారు. పేదల నిత్యావసరాల సరుకులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో మోదీ చిత్రపటానికి మండల బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ దసరా, దీపావళి తదితర పండుగల కానుకగా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులు రైతులు, విద్యార్థులు, మహిళలకు నేరుగా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అమెరికా విధించే అధిక టారిఫ్‌లకు భారత్ భయపడదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.తిరుపతయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ రామ్, నరేష్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సుక్క యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సుక్క మధు, మండల ఉపాధ్యక్షుడు రవి, అశోక్, సీనియర్ నాయకులు అశోక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల పోరుబాట

పెబ్బేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్లు పోరుబాట పట్టారు. అందులో భాగంగానే రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం బంద్ పిలుపునకు శుక్రవారం రేషన్ సరుకులు ఇవ్వకుండా మండలంలోని 19 రేషన్ దుకాణాలను మూసివేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5 వేలు ఇస్తామని, కమీషన్ పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు పంపిణీ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బియ్యం కమీషన్ బకాయిలతో పాటు పదేళ్లుగా పేరుకుపోయిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా వెంకటన్నగౌడ్

కొత్తకోట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా వెంకటన్న గౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడితో పాటు గౌరవ అధ్యక్షులుగా జనార్దన్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్ ఉపాధ్యక్షులుగా రాఘవేందర్‌గౌడ్, కృష్ణయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గౌడ్, కార్యదర్శులుగా నరేష్‌గౌడ్, రఘుగౌడ్, ప్రచార కార్యదర్శిగా రఘునాథ్‌గౌడ్, కోశాధికారిగా హరికృష్ణగౌడ్, కార్యవర్గ సభ్యులుగా దేవీగౌడ్, వెంకటేష్‌గౌడ్, చిన్న నారాయణగౌడ్, శివశంకర్‌గౌడ్ ఎన్నికయ్యారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వీపనగండ్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొల్లారం, కొర్లకుంట గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కొల్లాపూర్ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ గ్రామాల మీదుగా జిల్లా మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, బొల్లారం గ్రామ సీపీఎం కార్యదర్శి బాలగౌడ్ తెలిపారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందని, కొన్ని సమయాల్లో మూడు నాలుగు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వారంలో బస్సు ఏర్పాటు చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కృష్ణయ్య, వెంకటస్వామి, తిరుపతయ్య, రంగస్వామి, కావలి శ్రీనివాస్, సుబ్బన్న, మహేష్, భాస్కర్ పాల్గొన్నారు.

వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్ సీఎంఎంఎస్ (సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టం) పోర్టల్‌ను వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో తమ పిల్లలు పట్టించుకోకుండా వదిలేసే వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ద్వారా న్యాయం పొందడానికి అవకాశం ఉందన్నారు. ఆర్డీవో వద్ద ట్రిబ్యునల్ కేసులు పెట్టొచ్చు అన్నారు. ఒకవేళ ఆర్డీవో వద్ద న్యాయం దొరకకుంటే కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్డీవో వద్ద ట్రిబ్యునల్ కేసు పెట్టాలన్నా, లేదా కలెక్టర్ వద్ద అప్పీల్ చేసుకోవాలనుకున్న వారు కార్యాలయాల చుట్టు తిరగకుండా ప్రభుత్వం టీఎస్ సీఎంఎంఎస్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. తమ కేసును ఆన్‌లైన్ పోర్టల్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉండే ఇళ్లలో నివసిస్తున్న నిజమైన లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 18వ వార్డులో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని గల్లీల్లో మిషన్ భగీరథ నీటి కోసం తవ్విన రోడ్లు గుంతల మయంగా మారాయని, వెంటనే రోడ్లు వేసి డ్రైనేజీ సమస్యను సరి చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలన్నారు. మునిసిపల్ అధికారులు 100 రోజుల కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు పెరిగి దోమల వ్యాప్తి ఎక్కువైందన్నారు. పరమేశ్వరాచారి, మదన్, రాబర్ట్, పుల్లయ్య, రత్నయ్య, రాములు, నరసింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


శిథిలావస్థలోని ఇంటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సింగిల్‌విండో గోదాంకు మార్కింగ్

రేవల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో సింగిల్‌విండో గోదాంకు సింగిల్‌విండో చైర్మన్ రఘు శుక్రవారం మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామానికి ఎరువులు, పిండి సంచులు నిల్వ చేసుకోవడానికి వీలుండేలా గోదాం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి గాను సింగిల్‌విండో తరఫున రూ.5 లక్షల నిధులు మిగిలిన నిధులు ఎమ్మెల్యే నిధుల నుంచి సమకూర్చే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ మాట్లాడుతూ.. మా గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నరసింహ, బాలరాజు, కృష్ణయ్య, రవి, మల్లేష్, బాలపీరు, జలీల్, కృష్ణయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న నాయకులు

ప్రభుత్వ ఫలాలు పేదలకు అందజేయాలి

పెబ్బేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల అంజనేయులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై రెండు రోజుల సర్వేల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ సంక్షమ పథకాల అమలు తీరు విధానంపై ప్రజలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేనివారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి గ్రామంలో కేవలం 21 ఇళ్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. గ్రామంలో దళిత కాలనీల్లో 86 కుటుంబాలు ఉన్నాయని, 8 మంది కుటుంబాలు ఇప్పటికి గుడిసెల్లో నివాసం ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు నోచుకోలేదన్నారు. గ్రామంలో ఉపాధి లేక చాలా మంది ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. దేవన్న, వెంకటేష్, కాలనీ వాసులున్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

సమస్త మానవాళికి మార్గదర్శి మహమ్మద్ ప్రవక్త

- ఘనంగా మిలాద్ -ఉన్- నబీ

ఆత్మకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమస్త మానవాళికి మహమ్మద్ ప్రవక్త మార్గదర్శకంగా నిలిచారని ముస్లింలు అన్నారు. ఆయన 1,500 జయంతిని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త గొప్ప మానవతావాది, సమస్త లోకాలకు కరుణామయుడు, దయకు శాంతికి న్యాయానికి ప్రతీకగా నిలిచాడని, ఆయన చూపించిన మార్గాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే...

పెబ్బేరు : మిలాద్- ఉన్- నబీ పర్వదినాన్ని శుక్రవారం జామ్యా మసీద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు. మహ్మద్ ప్రవక్త జయంతిని ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రుచులు హోటల్, కంచిరావుపల్లిలో పాలకేంద్రాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శాలువా, పూలమాలలతో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, విజయవర్ధన్ రెడ్డి, వెంకటేష్ సాగర్, రంజిత్ కుమార్, దయాకర్ రెడ్డి, సురేందర్ గౌడ్, మల్లేష్ యాదవ్, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.


అమరచింతలో మహ్మద్ ప్రవక్త కేశాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో మిలాద్- ఉన్- నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమరచింత : మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జయంతి) ని పురస్కరించుకుని శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో ముస్లింలు ఘనంగా నిర్వహిం చుకున్నారు. పట్టణంలోని జామియా మసీదులో ముస్లింలు మహ్మద్ ప్రవక్త జయంతిని సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని బీడీ ఫ్యాక్టరీ పక్కన మసీదు ఆవరణంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు పెద్ద ఎత్తున కదిలి వచ్చి వేడుకలను జరుపుకున్నారు.

ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, అల్తాఫ్ బేగ్, ఫరీద్, ఇబ్రహీం, ఖయ్యూం, షైనోద్దిన్, సయ్యద్ కలాం పాషా, ఖాజా హుస్సేన్, కాసిం తౌఫిక్ షేక్ పాషా, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్లాగణపురం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గంగమ్మ ఒడికి గణనాథులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. వినాయక మండపాల వద్ద భక్తులు లడ్డూ వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అఖండ భజనలు కోలాటాలు, మహిళలు, యువకుల నృత్యాల మధ్య గ్రామాల్లో పురవీధుల వెంట ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో శోభాయాత్ర నిర్వహించి వినాయకులను గణప సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

రెండున్నర లక్షలు వేలం పలికిన లడ్డూ..

ఖిల్లాఘణపురం : మండలంలోని కమలొద్దీన్‌పూర్‌లో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వినాయకుడి లడ్డూ వేలంలో రూ.2,50,116 పలికింది. గురువారం రాత్రి వినాయకుడి నిమజ్జనానికి తీసుకెళ్తున్న సందర్భంలో హోరాహోరీగా లడ్డూ వేలం కొనసాగింది. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మర్యాద రామకృష్ణారెడ్డి లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం గణనాథుడికి పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవం గ్రామస్థులు పాల్గొన్నారు.

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం అధిక సంఖ్యలో గణపయ్యలను భక్తులు నిమజ్జనానికి తరలించారు. మరికొన్ని చోట్ల మాత్రం గణనాథులకు ఇంకా పూజలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిత్యం అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు ఆయా కాలనీలలో కొలువైన గణనాథులను దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేస్తున్నారు.

చిన్నంబావి : మండల పరిధిలోని మండల పరిధిలోని బెక్కెం గ్రామంలో యాదవ కాలనీలోని తెలుగు వీధి గణపతి నిమజ్జనం ఊరేగింపులో పల్లె కోలాటాలను ఆడుతూ భజనలతో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్న ఎస్‌ఐ జగన్ మోహన్ పాల్గొన్నారు.

కోలాటాలను చూసి రూ.1,016 కళాకారులకు బహుమతిగా అందజేశా రు. రామస్వామి యాదవ్ గజ్జి ఈదన్న యాదవ్, కృష, శివశంకర్, సురేష్, శివ, రాజు పాల్గొన్నారు.


కొత్తకోట రాఘవేంద్ర కాలనీలో..


వనపర్తిలో నృత్యం చేస్తున్న మహిళలు



వనపర్తిలో నృత్యం చేస్తున్న బాలురు, ఖిల్లాగణపురం మండలం కమలొద్దీన్‌పూర్‌లో వేలంలో లడ్డూను దక్కించుకున్న మర్యాద రామకృష్ణారెడ్డి